www.prajasakti.com

# ప్రజాశక్తి

గురువారం 18 ఏప్రిల్ 2024 | 8 పేజీలు

ఏలూరు | పశ్చిమ గోదావరి





# నామినేషన్లు షురూ..



**నేడు సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల**

**నేటి నుంచి 25వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ**

**అసెంబ్లీకి నియోజకవర్గ కేంద్రాల్లో, పార్లమెంట్‌కు జిల్లా కలెక్టరేట్లలో స్వీకరణకు ఏర్పాట్లు**

**అభ్యర్థితోపాటు మరో నలుగురికి మాత్రమే లోపలికి అవకాశం**

**అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామన్న ఏలూరు, పశ్చిమ జిల్లాల కలెక్టర్లు**

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

2024 లోకసభ, అసెంబ్లీ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ ఈ నెల 18వ తేదీ గురువారం విడుదల కానుంది. దీంతో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లనూ పూర్తి చేసినట్లు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కలెక్టర్లు తెలిపారు. ఏలూరు జిల్లాలో ఏడు, పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు, ఒక్కో జిల్లాలో ఒక్కో పార్లమెంట్ స్థానం ఉన్నాయి. ఆయా స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులంతా నేటి నుంచి నామినేషన్లు వేయనున్నారు. అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థులు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసినచోట నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. పార్లమెంట్‌కు పోటీ చేసే అభ్యర్థులు జిల్లా కలెక్టరేట్‌లో నామినేషన్ వేయాల్సి ఉంది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకూ నామినేషన్ల దరఖాస్తులు స్వీకరించనున్నారు. నామినేషన్ కేంద్రానికి వంద మీటర్ల వరకూ మూడు వాహనాలకు మాత్రమే అనుమతిస్తారు. నామినేషన్ దాఖలు చేసేందుకు లోపలికి వెళ్లేందుకు అభ్యర్థితోపాటు మరో నలుగురికి మాత్రమే అవకాశం ఉంటుంది. అసెంబ్లీకి నామినేషన్ వేసే అభ్యర్థులు రూ.పది వేలు, పార్లమెంట్‌కు నామినేషన్ వేసే అభ్యర్థులు రూ.25 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు సెక్యూరిటీ డిపాజిట్లలో 50 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి అభ్యర్థీ నాలుగు సెట్లు వరకూ నామినేషన్లు వేసే అవకాశం ఉంటుంది. రిజిస్టర్డ్ పార్టీ అభ్యర్థులకు నలుగురు, ఇండిపెండెంట్ అభ్యర్థులకు పది మంది మద్దతు తెలుపుతూ సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఈ నెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ, 26న నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఈ నెల 29వ తేదీతో నామినేషన్ల విత్‌డ్రాల ప్రక్రియ ముగియనుంది. అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల తుదిజాబితా తయారు ప్రకటించనున్నారు. ఆ తర్వాత పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ చేపట్టనున్నారు. ఏలూరు జిల్లాలో పోస్టల్, ఓట్ ఫర్ హోమ్ వంటివి మొత్తం కలిపి 22 వేలు వరకూ ఉన్నాయి. మే 13న ఎన్నికల పోలింగ్, జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లనూ పూర్తి చేసినట్లు ఏలూరు, పశ్చిమ జిల్లాల కలెక్టర్లు ప్రసన్న వెంకటేష్, సుమిత్ కుమార్ తెలిపారు. తొలి రెండు, మూడు రోజుల్లోనే నామినేషన్లు వేసేందుకు అత్యధిక మంది అభ్యర్థులు ముహూర్తం ఖరారు చేసుకున్న పరిస్థితి కనిపిస్తోంది. నామినేషన్ వేసిన దగ్గర నుంచి అభ్యర్థికి సంబంధించిన ఖర్చు ఆయన ఖాతాలో నమోదు కానుంది. అసెంబ్లీ అభ్యర్థికి రూ.40 లక్షలు, పార్లమెంట్ అభ్యర్థి రూ.95 లక్షలు వరకూ ఖర్చు చేసుకోవచ్చని ఎన్నికల కమిషన్ నిబంధన విధించింది. స్కూళ్లు, ప్రార్థనా ..6లో



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

## ఏలూరు జిల్లాలో ఓటర్లు 16.34 లక్షల మంది

**1744 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు**

**రూ.13.17 కోట్లు విలువైన నగదు, మద్యం, ఇతరాలు స్వాధీనం**

**ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్**

**ప్రజాశక్తి - ఏలూరు**

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం చేశామని ఏలూరు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ చెప్పారు. ఎన్నికల ఏర్పాట్లు నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఆర్‌ఒ డి.పుష్పమణితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 16. 34 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, పోలింగ్ నిమిత్తం 1744 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని ..6లో

## నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి

**పశ్చిమ కలెక్టర్ సుమిత్‌కుమార్**

**ప్రజాశక్తి - భీమవరం**



ఈ నెల 18వ తేదీ గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థి నామినేషన్ వేసినప్పటి నుంచి వారి ఖాతాలో ఖర్చు నమోదు చేస్తామని పేర్కొన్నారు. సభలు, సమావేశాలు, ఎన్నికల ప్రచార కార్యక్రమాలు, జెండాలు, బ్యానర్లు, పోస్టర్లు, వినియోగిస్తున్న వాహనాలు, ఏజెంట్లకు పెట్టే భోజనాల ఖర్చు సైతం అభ్యర్థి ఖాతా కిందకే వస్తాయని తెలిపారు. పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు ఇద్దరూ ఉమ్మడిగా ..6లో

## సివిల్స్‌లో నిట్ పూర్వ విద్యార్థిని నవ్యశ్రీ సత్తా

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎపి నిట్)కి చెందిన పూర్వ విద్యార్థిని గోవాడ నవ్యశ్రీ ప్రతిష్టాత్మకమైన సివిల్స్ ఫలితాల్లో సత్తా చాటింది. జాతీయ స్థాయిలో 995 ర్యాంకును సాధించింది. నవ్య శ్రీ స్వస్థలం ప్రకాశం జిల్లా ఒంగోలులోని గ్రీన్‌వ్యాలీ. తండ్రి శ్రీనివాసరావు ఎల్‌ఐసి బ్రాంచ్ మేనేజర్. ఆయన ప్రస్తుతం నరసాపురం బ్రాంచి మేనేజర్‌గా పని చేస్తున్నారు. తల్లి వెంకటరత్నం గృహిణి. ఎపి నిట్‌లో బిటెక్ (ఇఇఇ 8.3) పూర్తి చేసింది. బిటెక్ పూర్తి కాగానే నవ్యశ్రీ ఎపిపిఎస్‌సి నిర్వహించిన పరీక్షలో అద్భుత ప్రతిభ కనబరిచి ఉద్యోగానికి ఎంపికైంది. ప్రస్తుతం ఆమె వైద్యఆరోగ్య శాఖలో గ్రూప్-1 క్యాడర్ అధికారిగా (అడ్మిన్ ఆఫీసర్, విజయవాడ) ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తమ విద్యా సంస్థకు చెందిన పూర్వ విద్యార్థిని నవ్యశ్రీ సివిల్స్‌లో 995 ర్యాంకు సాధించడం తమకెంతో గర్వకారణంగా ఉందని ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ బిఎస్.మూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్, ఇఇఇ విభాగాధిపతి డాక్టర్ టి.రమేష్ తెలిపారు. నవ్య శ్రీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్యార్థులు ఆమెను ఆదర్శంగా తీసుకుని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు.

**నరసాపురం:** నవ్యశ్రీ తల్లిదండ్రులు నివాసం ఉంటున్న రాయిపేటలోని స్వగృహంలో బుధవారం నవ్యశ్రీని పలువురు అభినందించారు. ఎల్‌ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్స్, సిబ్బంది, ఏజెంట్లు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. రోటరీ క్లబ్ అధ్యక్షురాలు జి.సత్యవతి, అసిస్టెంట్ గవర్నర్ తోట శ్రీనివాస్, కోట్ల రామ్‌కుమార్, సలాది రామారావు, బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.



నవ్యశ్రీని అభినందిస్తున్న పలువురు ప్రముఖులు

**వాణిజ్య కేంద్రం.. తాడేపల్లిగూడెం**

మధ్యపేజీల్లో..

**ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి**

8లో..

**సెల్‌ఫోన్ టెక్నీషియన్ల ఆందోళన**

8లో..

## నిన్న ఫోన్లలో మంతనాలు.. నేడు ప్రత్యక్ష భేటీలు..!

**నేడు తేతలి నుంచి ప్రారంభం కానున్న జగన్ బస్సు యాత్ర**

**పెరవలి, సిద్ధాంతం మీదుగా తూర్పుగోదావరిలోకి యాత్ర**

**ప్రజాశక్తి - తణుకురూరల్**

జిల్లా నుంచి 'మేమంతా సిద్ధం' పేరిట సిఎం జగన్ బస్సు యాత్ర గురువారం ఉదయం ప్రారంభం కానుంది. మంగళవారం రాత్రి తేతలి చేరుకుని బస చేసిన సిఎం జగన్ బుధవారం పూర్తిగా బసలోనే విశ్రాంతి తీసుకున్నారు. నేరుగా ఎవరినీ కలవలేదు. తణుకు నియోజకవర్గ అసంతృప్త నేతలను కలుస్తారని ముందుగా ప్రచారం జరిగినా ఫోన్లలోనే మంతనాలు సాగించినట్లు సమాచారం. గురువారం ఉదయం యాత్ర ప్రారంభానికి ముందు ఆయా నేతలతో జగన్ భేటీ కానున్నట్లు తెలిసింది. అనంతరం బస్సు యాత్ర వై.జంక్షన్ మీదుగా పెరవలి, సిద్ధాంతం మీదుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోకి ప్రవేశించనుంది. అక్కడ నుంచి రాజమండ్రి మీదుగా రాజానగరం వరకూ యాత్ర సాగుతుందని నిర్వాహకులు తెలిపారు.



తేతలిలో జగన్ రాత్రి బస వద్ద పోలీసు బందోబస్తు


పంట కాలువ నుంచి నీటిని తోడుతున్న ఇంజన్లు

# దర్జాగా నీటి చౌర్యం

## పంట కాలువ నుంచి పరిశ్రమకు నీటి మళ్లింపు
## పట్టించుకోని అధికారులు

**ప్రజాశక్తి – ముదినేపల్లి**

పోల్‌రాజ్ పంటకాలువ ద్వారా తాగునీటి చెరువులకు అందిస్తున్న నీటిని ఓ పరిశ్రమకు చెందిన యజమాని రెండు చోట్ల ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు చేసి, నీటి చౌర్యానికి పాల్పడుతున్న సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే ఈనెల 12వ తేదీ నుంచి తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపుకునేందుకు పోల్‌రాజ్ కెనాల్‌కు అధికారులు నీటిని విడుదల చేశారు. ఇప్పటికే పలు గ్రామాల్లో తాగునీటి చెరువులు పూర్తి స్థాయిలో నింపగా, మరికొన్ని గ్రామాల్లో తాగునీటి చెరువులు అరకొరగా నిండాయి. ఇరిగేషన్, పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖల అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగా ఉండడంతో పలుచోట్ల నీటిచౌర్యం జోరుగా సాగుతోంది. పంట కాలువ ద్వారా వస్తున్న తాగునీటిని కొందరు దర్జాగా ప్రధాన కాలువ నుంచి, పంట బోదెల నుంచి తోడేసుకుంటున్నారు. ప్రజాశక్తి విలేకరి మంచినీటి చెరువులను పరిశీలించేందుకు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించగా తాగునీటి చౌర్యం కంటబడింది. మండలంలోని చిగురుకోట పంచాయతీ చెరువును పరిశీలించగా అప్పటికే మూడు రోజుల క్రితమే చెరువుకు పూర్తిస్థాయిలో తాగునీటిని నింపడం జరిగింది. అనంతరం మంచినీటి చెరువుకు రెండు కిలో మీటర్ల పైబడి దూరంలో ఉన్న ప్రధాన పంట కాలువను పరిశీలించేందుకు వెళ్లగా అక్కడ ఐదు ఇంజన్లు ఏర్పాటు చేసి కాలువ నుంచి నీటిని పంట బోదె ద్వారా చిగురుకోటలోని పరిశ్రమకు మళ్లిస్తున్నారు. పంచాయతీ చెరువు నింపేందుకు వినియోగించిన ఇంజన్‌లన్నీ పరిశ్రమకు కాలువ నుంచి నీటిని తోడుతున్నాయి. పరిశ్రమ వరకు వచ్చిన నీటిని పరిశ్రమ వద్ద మూడు కరెంటు మోటార్లు ఏర్పాటు చేసి పరిశ్రమలోకి మళ్లిస్తున్నారు. ఈ తంతు అంతా గత నాలుగు రోజులుగా రాత్రి, పగలు అనే తేడా లేకుండా జరుగుతున్నా.. సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. చిగురుకోట మంచినీటి చెరువుకు నీటిని నింపేందుకు వినియోగించిన ఇంజన్లను దారి మళ్లించి పరిశ్రమకు ఆ ఇంజన్ల ద్వారానే నీటిని మళ్లించటం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన నీటిని చౌర్యం జరగకుండా చూడాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

నీటి చౌర్యం విషయమై వివరణ అడిగేందుకు ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కృష్ణారావును ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

# రాగి, జొన్న జావతో ఆరోగ్యం..

## తక్కువ ధరకు అందిస్తున్న సత్యనారాయణ



బండి మీద విక్రయిస్తున్న జావ



**ప్రజాశక్తి – చింతలపూడి**

ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకీ ఎండ తీవ్రత డిగ్రీలు పెరుగుతూ ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. ప్రతి 10 నిముషాలకీ దాహం వేస్తోంది. శీతల పానీయాలు ఎంత తాగినా దాహం తీరని పరిస్థితి. పైగా శీతల పానీయాలు తాగటం వల్ల అనారోగ్యం పాలవుతున్నారు. రెండు వైపులా జేబు ఖాళీ అవుతుందని ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో చింతలపూడి మండలం సిపిఎం పార్టీకి చెందిన డి.సత్యనారాయణ ప్రజలకు మంచి ఆరోగ్యం ఇవ్వాలని తక్కువ ధరలో ఆర్గానిక్ పానీయలు, రాగి జావా, జొన్న జావా మండలంలో తిరుగుతూ అందిస్తున్నారు. ప్రజలకి తక్కువ ధరలో గ్లాస్ రూ.20కి రాగి, జొన్న జావాలను అందిస్తున్నారు. ఎండలో తిరిగిన జనాలకు అలసట లేకుండా జావ చేస్తుందని అంటున్నారు. రూపాయలు పెట్టి శీతల పానీయాలు కొన్నా దాహం తీరటం తగ్గటం లేదని, పని మీద బయటకు వస్తే రూ.200లు ఖర్చు అవుతున్నాయని, ఐతే రాగి, జొన్న జావా తగిన వారికి దాహం తక్కువగా ఉంటుందని, ఆ రోగ్యంకరంగా ఉంటుందని అంటున్నారు. చింతలపూడి, ప్రగడవరం, ఫాతిమాపురం, యర్రగుంటపల్లి గ్రామాల్లో తన మోటార్ వెహికల్ ద్వారా తిరుగుతూ అమ్ముతున్నారు. ఎక్కువ లాభాలు ఆశించకుండా, క్వాలిటీ జావని అందిస్తున్నారు.













## నేడు టిడిపి, జనసేన సమావేశం

**ప్రజాశక్తి – కొయ్యలగూడెం**

పోలవరం నియోజకవర్గంలో ఈనెల 18వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటలకు కొయ్యలగూడెం మండలం నరసన్నపాలెం వై.జంక్షన్ వద్ద వున్న దండమూడి కళ్యాణ మండపంలో ఉమ్మడి పార్టీల సమన్వయ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు జనసేన మండల కార్యదర్శి ఎపురి సతీష్ తెలిపారు. టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, జనసేన జిల్లా అధ్యక్షులు కోడికలపూడి గోవింద రావు, టిడిపి ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, జనసేన పోలవరం నియోజవర్గం అభ్యర్థి చిర్రి బాలరాజు పాల్గొంటారని తెలిపారు.

## తాగునీటి సరఫరా నిలుపుదల

**ప్రజాశక్తి – ముదినేపల్లి**

మండలంలోని ప్రధానమైన పంట కాల్వ సిబి కెనాల్‌కు అధికారులు తాగునీటి సరఫరాను నిలుపుదల చేశారు. నియోజవర్గంలోని ఈ కెనాల్ పరిధిలోని ఉన్న గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చేందుకుగాను మంచినీటి చెరువులకు ఈనెల 8వ తేదీన తాగునీటిని విడుదల చేశారు. వారం రోజులుగా ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు ఆయిల్ ఇంజన్ ద్వారా మంచినీటి చెరువులు నింపుకున్నారు. దీంతో ఈ కాలువ వంతు పూర్తి కావడంతో కాలువలో నీటి సరఫరాను అధికారులు నిలిపివేశారు.

# ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు


పాలకొల్లు: అన్నసమారాధనలో భక్తులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో శ్రీ రామనవమి కనుల విందుగా నిర్వహించారు. అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు.

**జంగారెడ్డిగూడెం టౌన్:** శ్రీరామనవమి సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, చిన్న, కోదండ రామాలయాన్ని బుధవారం దర్శించుకున్నారు. ఆమెతోపాటు కౌన్సిలర్ ఉగ్గం దుర్గాప్రసాద్, రాష్ట్ర మహిళా కార్యదర్శి కసరా తులసి రెడ్డి, గోకుల తిరుమల ట్రస్ట్ బోర్డ్ మెంబర్ ఉగ్గం సూరిబాబు పాల్గొన్నారు.

**ఆగిరిపల్లి:** ఆగిరిపల్లి విజయవాడ రోడ్డులోని కోదండ రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

**పెనుమంట్ర:** మార్టేరు శెట్టిబలిజ రామాలయంలో నిర్వహించిన వేడుకల్లో టిడిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ పాల్గొన్నారు.

**పోలవరం :** మండలంలో శ్రీరామనవమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వడపప్పు, చలివిడి, పానకాల వితరణ కార్యక్రమం నిర్వహించారు.

## పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వేడుకలు..

**ఏలూరు స్పోర్ట్స్:** జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏలూరు జిల్లా ఎఆర్ అదనపు ఎస్‌పి శేఖర్ దంపతులు నగరంలోని పోలీస్ లైన్‌లో ఉన్న రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. గత 89 సంవత్సరాలుగా అమ్మినపేట శ్రీరామాలయంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్నామని శేఖర్ తెలిపారు.

**ముసునూరు:** మండలంలోని 16 గ్రామాల్లోని రామ మందిరాల్లో కళ్యాణ వేడుకలతో పాటు భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు చెక్క భజన కార్యక్రమాలతో ఆయా గ్రామాల్లో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

**తాడేపల్లిగూడెం:** ఏలూరు రోడ్‌లోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో శ్రీరామనవమి వేడుకలు బుధవారం వైభవోపేతంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం సుమారు వెయ్యి మందికి అన్న ప్రసాద వితరణ జరిగింది.

**భీమవరం రూరల్:** పట్టణంలోని నాచువారి సెంటర్‌లో ఉన్న రాధాకృష్ణ మందిరం వద్ద బుధవారం శ్రీరామనవమి వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ స్వామి వారికి, అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

**మొగల్తూరు:** మండలంలోని పెంకె వారి కాంప్లెక్స్‌లోని బట్టల వర్తక సంఘం ఆధ్వర్యంలో పెటపల్లం, సత్రవపాలెం, కాళీపట్నం తూర్పు, తదితర గ్రామాల్లో అన్న సమారాధనలు చేశారు.

## శ్రీదేవి ట్రస్ట్ ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలు

**కాళ్ల:** మండలంలోని కాళ్లకూరు, దొడ్డనపూడి, జువ్వలపాలెం గ్రామాల్లో శ్రీరామనవమి సందర్భంగా దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామని అధినేత దాట్ల వెంకట రామరాజు తెలిపారు. కాళ్లకూరులో ఐదు రామాలయాలకు బెల్లం, మినరల్ వాటర్ అందించామన్నారు. ఒక్కొక్క రామాలయానికి 40 కేజీల బెల్లం, 400 లీటర్ల మినరల్ వాటర్ నీటిని అందించామన్నారు. దొడ్డనపూడి గ్రామం కచ్చాగరవులో శ్రీరామనవమి సందర్భంగా అన్నసమారాధనకు 50 కేజీల బియ్యాన్ని అందించామన్నారు.

**ఉండి:** నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉండి శ్రీరామ క్షేత్రంలో వెంకట సహస్ర కోలాటం గ్రూప్ చేసిన కోలాటం ప్రదర్శన భక్తులను పరవశింప చేసినట్లు పలువురు తెలిపారు.

**పాలకొల్లు :** హౌసింగ్ బోర్డు కాలనీ, గుత్తుల వారి పేట, రైల్వే గేటు సెంటర్, లాకులు, బంగారు కొట్టు, కెనాల్ రోడ్‌లోని ఆంజనేయ, వెంకటేశ్వర స్వామి ఆలయం, ముచ్చర్ల వారి వీధి ఇలా పలు చోట్ల శ్రీరాముని కళ్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

**చాట్రాయి:** చాట్రాయిలోని రామాలయంలో దామెర బుచ్చిబాబు, ప్రసాద బాబు, మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

**నరసాపురం:** మండలంలోని ప్రధానంగా మెయిన్ రోడ్‌లోని కుమ్మర వీధి రామాలయం, రుస్తుంబాద కొత్తపల్లి వారి వీధి, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ రోడ్డు, మొగల్తూరు రోడ్డు ఆంజనేయ స్వామి ఆలయం, టాక్సీ స్టాండ్ తదితర ప్రాంతాలలో ఉన్న రామాయాలలో వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎంఎల్ఎ కొత్తపల్లి జానకీరామ్, వ్యాపార వేత్త మారం దత్తు మజ్జిగ, పానకం పంపిణీ చేశారు.

**చింతలపూడి:** మండలంలోని ఎర్రగుంటపల్లి, మక్కినవారిగూడెం సమీపంలోని రాముని గట్టు శ్రీరామ రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన సీతారాముని కళ్యాణ మహోత్సవంలో తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు సీతారామాంజనేయ చౌదరి, రేణుక దంపతులు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. లింగపాలెం మం డలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవంలో ముఖ్య అతిథిగా వైసిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు పాల్గొన్నారు.

**ఆచంట:** ఆచంట మదన గోపాల స్వామి, కొడమంచిల్లోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయాల్లో నిర్వహించిన వేడుకల్లో యాత్రికులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కొత్తూరు సెంటర్‌లోని రామాలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.

**ఆకివీడు :** మండలంలోని రాజులపేట, కోళ్లపర్రు, సిద్ధాపురం, కాలింగగూడెం, ఆకివీడు, భీమవరం గ్రామాల్లో రామాలయాలను ఉండి స్వతంత్ర అభ్యర్థి సందర్శించారు.

**వీరవాసరం :**వీరవాసరం సీతారామ స్వామి దేవస్థానంలో రావాడ రామ్మోహన్ రావు, వరలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తులకు పానకాలు పంచారు.





జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చేతుల మీదుగా బి ఫారాలు అందుకుంటున్న పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థులు నాయకర్, ధర్మరాజు, శ్రీనివాస్

# జనసేన అభ్యర్థులకు బి ఫారాలు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ బుధవారం మంగళగిరిలోని ఆ పార్టీ కార్యాలయంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా బి ఫారం అందుకున్నారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో నరసాపురం ఎంఎల్ఎగా భారీ మెజార్టీతో గెలుస్తానన్నారు.

**ఉంగుటూరు :** జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజుకు బి ఫారమ్ పత్రాన్ని బుధవారం మంగళగిరిలో జనసేన కార్యాలయంలో పవన్ కళ్యాణ్ అందజేశారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ఖచ్చితంగా కూటమి గెలుస్తుందని ధీమా ఇరువురు నేతలు వ్యక్తం చేశారు.

**తాడేపల్లిగూడెం :** జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అధినేత పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా బి ఫారం అందుకున్నారు. ఈ పత్రాన్ని మంగళగిరి జనసేన కార్యాలయంలో అందుకున్నారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడారు.

# కూటమితోనే గెలుపు : పార్థసారథి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఎన్డిఎ కూటమి గెలుపుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని కొమ్మూరు, సూరవరం గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. తాను ఎంఎల్ఎగా గెలిచిన తర్వాత తాగునీరు, డ్రైనేజీ, అంతర్గత రోడ్లు, సిసి రోడ్ల ఏర్పాటుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పాటుపడతానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.సుబ్బారావు, జి.శివశంకర్, సి.హెచ్.శివరామకృష్ణ, దావీదు, నాగరాజు, నరసయ్య పాల్గొన్నారు.

**ముసునూరు :** కూటమి గెలుపు ఖాయమని టిడిపి నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. ఆగిరిపల్లి మండలం కొమ్మూరు, సూరవరం గ్రామాల్లో పార్థసారథి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఎన్డిఎ కూటమితోనే సాధ్యమని తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

**ఏలూరు టౌన్:** టిడిపి దెందులూరు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌ను గెలిపించాలని చింతమనేని సతీమణి రాధమ్మ దెందులూరు మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. జోగన్నపాలెంలో బాబు సూపర్ సిక్స్ కార్యక్రమంలో భాగంగా చింతమనేని రాధమ్మ, మాజీ సొసైటీ అధ్యక్షులు పసుమర్తి మధు, గ్రామ సర్పంచ్ పసుమర్తి రాజేశ్వరమ్మ, మాజీ సర్పంచ్ పాలపాటి రామబ్రహ్మంతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బలుసు రాంబాబు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఎన్నికల నోటిఫికేషన్

## ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్ల స్వీకరణ - 25వ తేదీతో ఆఖరు

ప్రజాశక్తి - ఆచంట

సార్వత్రిక ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుందని, ఈనెల 18వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు అన్ని ఏర్పాట్లూ చేసినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, పర్యాటకశాఖ రీజినల్ డైరెక్టర్ వి.స్వామినాయుడు అన్నారు. బుధవారం ఆయన తహశీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నామినేషన్ దాఖలకు చివరి తేదీ 25 కాగా, 26న పరిశీలన ఉంటుందన్నారు. నామినేషన్ ఉపసంహరణకు 29వ తేదీ వరకూ అవకాశం ఉందన్నారు. అనంతరం అదే రోజు మూడు గంటలకు అభ్యర్థుల గుర్తులు కేటాయించి, 3:30 గంటలకు అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామని తెలిపారు. నామినేషన్ దాఖలకు అభ్యర్థుల 13 రకాల డాక్యుమెంట్లు తీసుకురావాలని, ఇవన్నీ సక్రమంగా ఉంటేనే అనుమతిస్తామని తెలిపారు. 25వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ మాత్రమే నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. పబ్లిక్ సెలవు రోజున నామినేషన్లు స్వీకరించబోమన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో గరిష్ఠంగా మూడు వాహనాలు, అభ్యర్థితో సహా ఐదుగురిని మాత్రమే ఆర్ఒ కార్యాలయం లోపలికి అనుమతిస్తారన్నారు. అభ్యర్థి సువిధ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నామినేషన్లు సమర్పించవచ్చన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థి స్వీకరించే డిపాజిట్ కింద రూ.10 వేలు, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులైతే క్యాస్ట్ సర్టిఫికెట్ జతచేసి రూ.5 వేలు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో డిపాజిట్‌గా చెల్లించాలని లేనిపక్షంలో ట్రెజరీలో కేటాయించిన పద్దులో చెల్లించిన చలానా, రిజర్వ్ బ్యాంకులో నగదు జమ చేసిన చలానా అందజేయొచ్చని తెలిపారు.

**ఫారం 26 తప్పనిసరి..**

అభ్యర్థులకు చెందిన అన్ని విషయాలూ ఫారం 26లో అఫిడవిట్‌తో తప్పనిసరిగా అందించాలన్నారు. నోటరీ చేసిన అఫిడవిట్‌లో అభ్యర్థి విద్యార్హతలు, ఆస్తులు, అప్పులు, క్రిమినల్ కేసుల వివరాలు పొందుపర్చాలన్నారు. ఫారంలోని అన్ని కాలమ్స్ పూర్తి చేయాలన్నారు. నామినేషన్ తేదీ నుంచి ఫలితాలు ప్రకటించే వరకూ ఖర్చు నవెూదవుతుందన్నారు. అభ్యర్థులకు ఏమైనా సందేశాలుంటే కంట్రోల్ రూమ్ నంబర్ 08814 297299ను సంప్రదించాలన్నారు. నామినేషన్ పత్రాలు ఉచితంగా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పొందొచ్చన్నారు.



ఆర్ఒ స్వామినాయుడు

**కాళ్ల :** సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. ఈ నెల 18వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించగా, అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలైంది. ఈ నియోజకవర్గాలకు సంబంధించి ఇప్పటికే ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, పోలింగ్ సిబ్బంది కేటాయింపు, బందోబస్తు తదితర అధికారిక కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఓటింగ్ శాతం పెంచేందుకు యువత, వృద్ధులు, మహిళల ఓటింగ్ పెరిగేలా ఉమ్మడి జిల్లా యంత్రాంగం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అభ్యర్థులు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ నామినేషన్లు దాఖలు చేయొచ్చు. అభ్యర్థులు 25 ఏళ్లు నిండిన వారై, ఏదో అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండాలి.

**సీనియర్ సిటిజన్లకు హోమ్ ఓటింగ్..**

ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా అన్ని సదుపాయాలూ ఈ ఎన్నికల్లో అమల్లోకి తెచ్చారు. ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్లు, 85 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్లకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం కల్పించారు. ఉండి అసెంబ్లీ నియోజకవర్గంలోని 238 పోలింగ్ కేంద్రాల్లోనూ తుదిఓటర్ల జాబితా విడుదల చేశారు. పురుషులు 109414 మంది, స్త్రీలు 113583 మంది, ట్రాన్స్ జెండర్లు ఇద్దరు, ఇటీవల 102 మంది ఓటర్లు కొత్తగా చేరారు. ప్రస్తుతం 2,23,101 మంది ఓటర్లు ఉన్నారు.

**నామినేషన్లు దాఖలు చేయనున్న అభ్యర్థులు..**

కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యరి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు, వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్ నరసింహరాజు ఈ నెల 19న నామినేషన్లు వేయనున్నారు. అలాగే ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు(టిడిపి), ఉండి మాజీ ఎంఎల్ఎ స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు, నరసాపురం ఎంపీ కనుమూరి రఘు రామకృష్ణంరాజు (టిడిపి) ఈ నెల 22న నామినేషన్లు వేయనున్నారు.

**నూజివీడు రూరల్ :** నూజివీడు వర్గానికి సంబంధించి ఈ నెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి వై.భవానీ శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఈ నెల 21వ తేదీ ఆదివారం కావడంతో ఆ రోజు నామినేషన్లు స్వీకరించబోమని తెలిపారు. అభ్యర్థితోపాటు మరో నలుగురి వ్యక్తులను అనుమతిస్తామని తెలిపారు.




# వాణిజ్య కేంద్రం.. తాడేపల్లిగూడెం

**జిల్లాలోని డెల్టా, మైదాన ప్రాంతాల ముఖద్వారంగా ఉంటమే కాక ఎప్పటి నుంచో జాతీయ స్థాయి వాణిజ్యానికి, ఇటీవల విద్యారంగానికి కేంద్రంగా మారింది తాడేపల్లిగూడెం. జల రవాణాకు ప్రాధాన్యత తగ్గిపోయి రోడ్డు రవాణా ప్రాముఖ్యత సంతరించుకున్న కాలం నుంచి తాడేపల్లిగూడెం అభివృద్ధి ప్రారంభమైంది. గూడెంలోని కాసు బ్రహ్మానందరెడ్డి మార్కెట్ ద్వారా రాష్ట్రంలో, దేశంలోని పలు ప్రాంతాలకు ఉల్లిపాయలు, కూరగాయలు ఎగుమతి అవుతుంటాయి. దేశంలో అరుదైన ఉద్యాన విశ్వవిద్యాలయాల్లో రెండోది వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచింది. రానున్నకాలంలో దీన్ని పూర్తిస్థాయి వ్యవసాయ విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు కేంద్రం వద్ద ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఎన్నో ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, వ్యవసాయ పాలిటెక్నిక్, బిఇడి వంటి వృత్తి విద్యా కళాశాలలు, పలు డిగ్రీ కళాశాలలతోపాటు ఆంధ్రా విశ్వవిద్యాలయ పీజీ కేంద్రం కూడా వెలసింది. రాష్ట్ర విభజన అనంతరం కేంద్రీయ విద్యాసంస్థ నిట్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఇక్కడే ఏర్పాటు చేశారు. గూడెంలో సాహిత్య కళాసంస్థలు సాహిత్యోపన్యాసాలు, హరికథలు, జాతీయ నాటిక పోటీలు సంగీతోత్సవాలు వంటి కార్యక్రమాల నిర్వహణతో కళాకేంద్రంగా విరాజిల్లుతోంది.**



**నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాలు**

తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రస్తుతం తాడేపల్లిగూడెం పట్టణం, పెంటపాడు మండలం, తాడేపల్లిగూడెం మండలం ఉన్నాయి. 2009 నాటికి గూడెం నియోజకవర్గంలో ఉన్న నిడమర్రు మండలాన్ని ఉంగుటూరు నియోజకవర్గంలో చేర్చారు. తణుకు నియోజకవర్గంలోని కృష్ణాయపాలెం, ఆరుళ్ల గ్రామాలను గూడెం పరిధిలో చేర్చారు.


**రేలంగి గూడెం వారే..**

రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల్లో పేరొందిన ప్రముఖులు తాడేపల్లిగూడెం నుంచి ఎదిగారు. సుప్రసిద్ధ హాస్యనటుడు రేలంగి వెంకట్రామయ్యది తాడేపల్లిగూడెమే. తన పేరు మీద పట్టణంలో సినీ ప్రదర్శనశాలను నిర్మించారు. ప్రముఖ రంగస్థల నటుడు మద్దాల రామారావు, సినీ దర్శకుడు కృష్ణవంశీ, హాస్యనటుడు ఐరన్‌లెగ్ శాస్త్రి, సినీనటి సుదీప, శిల్పి, పద్మశ్రీ గ్రహీత తాడేపల్లి వెంకన్న, కంచి కామకోటి పీఠం ఆస్థాన విద్వాంసులు అమ్మనమంచి బలరామశాస్త్రి, సరస్వతులు హనుమంతరావు, కవి జంధ్యాల శాంతిశ్రీ వంటి వారు తాడేపల్లిగూడెం ప్రాంతం నుంచే పేరొందారు. సినీ కవి సిరివెన్నెల సీతారామశాస్త్రి చాలాకాలం తాడేపల్లిగూడెంలో ఉద్యోగం చేశారు. ప్రసిద్ధ హిందీ సినీనటి రేఖ తల్లి గూడెంలో నివాసం ఉండేవారు.

| సంవత్సరం | విజేత | పార్టీ |
|---|---|---|
| 1955 | నంబూరి శ్రీనివాసరావు | కాంగ్రెస్ |
| 1962 | అల్లూరి కృష్ణారావు | కాంగ్రెస్ |
| 1967 | అల్లూరి కృష్ణారావు | కాంగ్రెస్ |
| 1972 | ఈలి ఆంజనేయులు | స్వతంత్ర |
| 1978 | మూర్తిరాజు | కాంగ్రెస్ |
| 1983 | ఈలి ఆంజనేయులు | టిడిపి |
| 1985 | యర్రా నారాయణస్వామి (బెనర్జీ) | టిడిపి |
| 1987 (ఉప) | ఈలి వరలక్ష్మి | కాంగ్రెస్ |
| 1989 | పసల కనకసుందరరావు | టిడిపి |
| 1994 | పసల కనకసుందరరావు | టిడిపి |
| 1999 | యర్రా నారాయణస్వామి | టిడిపి |
| 2004 | కొట్టు సత్యనారాయణ | కాంగ్రెస్ |
| 2009 | ఈలి వెంకట మధుసూదనరావు (నాని) | పిఆర్‌పి |
| 2014 | పైడికొండల మాణిక్యాలరావు | బిజెపి |
| 2019 | కొట్టు సత్యనారాయణ | వైసిపి |

**రాజకీయ విశేషాలు**

తాడేపల్లిగూడెం తొలి అసెంబ్లీ ఎన్నిక నియోజకవర్గం నాటికి అలంపురం నియోజకవర్గంలో ఉండేది. అనంతరం కాలంలో అలంపురమే తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని పెంటపాడు మండలంలో ఓ గ్రామంగా మిగిలింది.




గూడెం పట్టణానికి చెందిన సాహితీవేత్త రాజకీయ ప్రముఖుడు పసల సూర్యచంద్రరావు ఉంగుటూరు నియోజకవర్గం నుంచి గెలుపొంది ఆంధ్రరాష్ట్రానికి తొలి అసెంబ్లీ ఉప సభాపతిగా వ్యవహరించారు. నేటికీ జిల్లా నుంచి ఉపసభాపతి బాధ్యతలు చేపట్టిన వారు మరెవరూ లేకపోవడం గమనార్హం. యర్రా నారాయణస్వామి తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి ఎంఎల్ఎగా గెలిచి వెంటనే వచ్చిన జిల్లా పరిషత్ ఎన్నికల్లో పాల్గొన్నారు. ఆ ఎన్నికల్లో ఆయన గెలుపొంది జిల్లా పరిషత్ ఛైర్మన్ అయ్యారు. ప్రత్యక్ష ఎన్నికల్లో విజయం సాధించి జిల్లా పరిషత్తు ఛైర్మన్‌గా ఎన్నికైన ఏకైక వ్యక్తిగా నిలిచారు. ఈలి వెంకట సత్యనారాయణ గూడెం పురపాలక సంఘం ఛైర్మన్ పదవికి ఎన్నికై, రాష్ట్ర పురపాలక సభాధ్యక్షుల సమాఖ్య అధ్యక్షునిగా వ్యవహించారు. చింతలపాటి వర ప్రసాదమూర్తిరాజు, ఈలి ఆంజనేయులు ఈ నియోజకవర్గం నుంచి ఎన్నికై మంత్రి పదవులను అలంకరించారు. గూడెం మండలం మాధవరానికి చెందిన సమరయోధులు పత్తి శేషయ్య, పత్తి మణెమ్మ రాష్ట్రస్థాయిలో పలు ఉద్యమాల్లో పాల్గొన్నారు. స్వాతంత్రానికి పూర్వం నుంచి ఈ గ్రామంలో ప్రతి ఇంటా కనీసం ఒకరైనా సైనికులుగా ఉంటున్నారు. మణెమ్మ పెనుగొండ నియోజకవర్గం నుంచి ఎంఎల్ఎగా గెలుపొంది ఎన్‌టిఆర్ ప్రభుత్వంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రిగా పదవి చేపట్టారు. తాడేపల్లిగూడెం ఎంఎల్ఎగా పనిచేసిన యర్రా నారాయణస్వామి శాసనమండలి సభ్యునిగా ఉండగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖామంత్రిగా పనిచేశారు.




**ఎంఎల్ఎలుగా భార్యాభర్తలు**

ఒకే నియోజకవర్గంలో భార్యాభర్తలు ఎంఎల్ఎలుగా గెలుపొందడం అరుదైన విషయం. ఈలి కుటుంబంతో నియోజకవర్గానికి ప్రత్యేక అనుబంధం ఉంది. ఈలి ఆంజనేయులు గూడెం పురపాలక సంఘం అధ్యక్షునిగా చేయడంతోపాటు రెండుసార్లు ఎంఎల్ఎగా ఎన్నికయ్యారు. ఆయన భార్య వరలక్ష్మి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచి ఎంఎల్ఎ పదవి చేపట్టారు. ఆంజనేయులు కుమారుడు ఈలి వెంకట సత్యనారాయణ గూడెం ఛైర్మన్‌గా, మరో కుమారుడు ఈలి వెంకట మధుసూదనావు(నాని) వైస్ ఛైర్మన్‌గా, ప్రతిపక్ష నేతగా, 2009 ఎన్నికల్లో పిఆర్‌పి తరపున ఎంఎల్ఎగా గెలుపొందారు.

**రెండోసారి విజేతలు..**

గూడెం నియోజకవర్గంలో ఉప ఎన్నికతో కలిపి 15_సార్లు ఎన్నికలు జరగ్గా నలుగురు నేతలు రెండుసార్లు ఎన్నికయ్యారు. 1962, 67లో అల్లూరి కృష్ణారావు కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందగా, 1972లో స్వతంత్ర అభ్యర్థిగా, 1983లో టిడిపి అభ్యర్థిగాను ఈలి ఆంజనేయులు విజయం సాధించారు. యర్రా నారాయణస్వామి 1985 మధ్యంతర ఎన్నికల్లో 1999 సాధారణ ఎన్నికల్లోనూ గెలుపొందారు. 1989, 1994 సాధారణ ఎన్నికల్లో పసల కనకసుందరరావు విజేతగా నిలిచారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన ఈలి నాని అనంతర పరిణామాల్లో ఆ పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కాగా కాంగ్రెస్ సభ్యునిగా కొనసాగారు. ఇటీవల కొట్టు సత్యనారాయణ, ఈలి నాని టిడిపిలో చేరారు.




నిట్ కళాశాల

# నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

## ఉంగుటూరు రిటర్నింగ్ అధికారి ఎన్ఎస్‌కె ఖాజావలీ



ప్రజాశక్తి - ఉంగుటూరు

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ నెల 18వ తేదీ నుంచి అసంబ్లీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని ఉంగుటూరు రిటర్నింగ్ అధికారి ఎన్ఎస్‌కె ఖాజావలీ అన్నారు. బుధవారం ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎన్నికలకు సంబంధించి పలు అంశాలపై ఆయన మాట్లాడారు.

**ప్రశ్న : నియోజకవర్గంలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎంత మంది ఓటర్లు ఉన్నారు?**

**ఆర్ఒ :** ఉంగుటూరు నియోజకవర్గంలోని ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం మండలాల పరిధిలో 214 పోలింగ్ కేంద్రాలు, 20,5,334 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 10,1,152 మంది పురుషులు, 10,4,177 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

**ప్రశ్న : సి విజిల్‌లో ఎన్ని ఫిర్యాదులొచ్చాయి. వాటిలో ఎన్ని పరిష్కరించారు?**

**ఆర్ఒ :** నియోజకవర్గంలో 28 ఫిర్యాదులొచ్చాయి. వాటిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పరిధిలో లేని ఆరింటిని తిరస్కరించి మిగతా 22 ఫిర్యాదులను అందిన కొద్ది గంటల్లోనే పరిష్కరించాం.

**ప్రశ్న : సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియలో ఎంత నగదు సీజ్ చేశారు? ఎంత రిలీజ్ చేశారు.**

**ఆర్ఒ :** ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం మండలాల్లో నాలుగు చోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేసి రోజుకు రెండు షిఫ్టుల్లో అధికారులతో తనిఖీలు చేయించగా 41 సోదాల్లో రూ.52,90,000 వరకూ సీజ్ చేశాం. అనంతరం సంబంధిత ఆధారాలు చూపించగా 37 మందికి రూ.43 లక్షలకుపైగా తిరిగి వెనక్కి ఇచ్చేశాం. మిగతా సొమ్ము త్రిమేన్ కమిటీ పరిధిలో ఉన్నాయి.




**ప్రశ్న: ఓటర్ హెల్ప్‌లైన్, వాట్సప్, కంప్లైంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సిఎంఎస్), మెయిల్ తదితర మార్గాలో ఎన్ని ఫిర్యాదులు స్వీకరించారు?**

**ఆర్ఒ :** ఓటర్ల నుంచి వివిధ మార్గాల ద్వారా 19 ఫిర్యాదులు వచ్చాయి. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం వాటన్నింటినీ తక్షణం పరిష్కరించాం.

**ప్రశ్న : ఈ నెల 15వ తేదీ వరకూ కొత్తగా ఓటు నమోదు వివరాలు తెలియజేస్తారా?**

**ఆర్ఒ :** 2024 జనవరి ఒకటి నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు కొత్తగా ఓటు హక్కు కోసం (ఫారం-6) దరఖాస్తులు చేసుకునేందుకు ఎన్నికల సంఘం ఈ నెల 15వ తేదీ వరకూ అవకాశం ఇచ్చింది. దీంతో నియోజకవర్గంలో 2,086 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 18 ఏళ్లు దాటిన కొత్త ఓటర్లే 800 మందికి పైగా ఉన్నారు. వివిధ కారణాలతో ఓటర్ల జాబితాలో తొలగింపుల (ఫారం-7) కోసం 1232 దరఖాస్తులు రాగా వాటిలో 45 తిరస్కరించి 1013 క్లయిములు పరిష్కరించాం. చిరునామా, ఓటు బదిలీ (ఫారం-8) కోసం 1531 అప్లికేషన్లు రాగా 65 తిరస్కరించి 869 స్వీకరించాం.

**ప్రశ్న : నామినేషన్ల కోసం ఎలాంటి చర్యలు తీసుకున్నారు?**

**ఆర్ఒ :** ఉంగుటూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద అసెంబ్లీ స్థానానికి పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశాం. అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే ఇద్దరు తహశీల్దార్లు, ఒక ఎంపిడిఒతో ప్రత్యేక టీమ్ సహకారం అందించనున్నారు. నామినేషన్ కేంద్రం సమీపంలో ఆంక్షలు విధించాం. సీసీ కెమెరాలు సైతం బిగించాం. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు మరో నలుగురు మాత్రమే లోపలికి అనుమతి ఉంది. స్వతంత్ర, నాన్ రిజిష్టర్ పార్టీ అభ్యర్థులకు మాత్రం అభ్యర్థితో పాటు తొమ్మిది మందికి అనుమతి ఉంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు భద్రతా బందోబస్తు ఏర్పాటు ఉంది.

**ప్రశ్న : పోలింగ్ కోసం ఎంత మందిని నియమించారు?**

**ఆర్ఒ :** ఏలూరు జిల్లా పరిధిలో ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు మండలాల్లో 1300 మందికి పైగా వివిధ స్థాయిల్లో పోలింగ్ అధికారులు, సిబ్బందిని నియమించాం. ఇదే నియోజకవర్గానికి చెందిన గణపవరం మండలానికి మరో 300 మంది ఎన్నికల సిబ్బంది అవసరం ఉంది. అయితే ఈ మండలం పశ్చిమగోదావరి జిల్లా పరిధి కాబట్టి సిబ్బంది ఎలాట్‌మెంట్ రావాల్సి ఉంది.

**ప్రశ్న : మండలాల వారీగా ఓటర్ల జాబితా చెబుతారా?**

**ఆర్ఒ :** ఉంగుటూరు మండలంలో 63,645 మంది, భీమడోలులో 52,518 మంది, నిడమర్రులో 37,276 మంది, గణపవరంలో 51,895 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులోనే పిడబ్ల్యూడి ఓటర్లు 3,524 మంది, యువ ఓటర్లు 5,493 మంది ఉన్నారు.

**ప్రశ్న : 214 పోలింగ్ కేంద్రాల్లో అత్పల్పం, అత్యధికం ఓట్లు ఎక్కడ ఉన్నాయి?**

**ఆర్ఒ :** ఉంగుటూరు కాగుపాడు పోలింగ్ బూత్ నంబరు 28లో 1370 ఓట్లు అత్యధికంగా ఉన్నాయి. భీమడోలు మండలం మల్లవరం పిఎస్ నంబరు 123లో అత్యల్ప ఓటర్లు 353 మందే ఉన్నారు.

**ప్రశ్న : ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?**


**ఆర్ఒ:** ప్రజాస్వామ్యంలో ఓటు వినియోగం అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశం. గ్రామాల్లో మా సిబ్బందితో చైతన్యం కలిగించడం, యువ ఓటర్లకు పెద్ద సంఖ్యలో ఓటు హక్కు కల్పించి వారందరితో ఓటు వేసేలా చర్యలు తీసుకున్నాం. గత ఎన్నికల కంటే ఓటింగ్ శాతం పెంచడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నాం.

**ప్రశ్న: ఓటు వేసేందుకు ఎలాంటి ఆధారాలు వెంట తీసుకెళ్లాలి?**

**ఆర్ఒ :** ఓటర్ల జాబితాలో పేరున్న ప్రతి ఓటరూ ఎపిక్ కార్డుతో పాటు ప్రభుత్వం గుర్తించి 12 రకాల కార్డుల్లో ఏదైనా వెంట తీసుకెళ్లి పోలింగ్ అధికారులకు చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఓటరు ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయనున్నాం. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ అవకాశం ఇవ్వనున్నాం.

**ప్రశ్న : ఇవిఎంలు ఎన్ని వచ్చాయి?**

**ఆర్ఒ :** ర్యాండమైజేషన్ అనంతరం ఇవిఎంలు, సెంట్రల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివిప్యాడ్ తదితర పోలింగ్ సామగ్రి 10 శాతం అదనంగా 256 ఇవిఎంలు వచ్చాయి. వాటిని నారాయణపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల స్ట్రాంగ్ రూమ్‌లో కట్టుదిట్టమైన భద్రతలో ఉంచాం. అక్రిడేషన్ కలిగిన పాత్రికేయులకు కూడా ఈసారి బ్యాలెట్ ఓటింగ్ కల్పించనున్నాం.



రాములోరి సాక్షిగా కలుసుకున్న వైసిపి అభ్యర్థి గుడాల గోపి, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్

# రాములోరు కలిపారు ఇద్దరినీ..

## శ్రీరామనవమి ఉత్సవాల్లో అంగర, గోపి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎన్నికల వేళ బిజీబిజీగా ఉన్న భిన్న ధృవాల నేతలను రాములోరు కలిపారు. శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం పాలకొల్లు గుత్తుల వారి పేటలోని రామాలయం వద్ద వైసిపి అభ్యర్థి గుడాల గోపి, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ కలిశారు. ప్రచారంలో ఇరు పార్టీల వారు విడివిడిగా విమర్శించుకుంటున్నా రాములోరి సాక్షిగా ఆప్యాయంగా పలకరించుకున్నారు. అంగరతో పాటు వైసిపి నేతలు యడ్ల తాతాజీ, అడబాల వెంకటరమణ, కర్రా జయ సరిత, పెచ్చెట్టి విమల లక్ష్మి, జోగి వెంకటేశ్వరరావు, టిడిపి నేత పొట్లూరి అప్పన్న పాల్గొన్నారు.

# ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రాష్ట్ర అభివృద్ధికి ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం, కాంగ్రెస్ నాయకులు కోరారు. ఇండియా వేదికలో భాగంగా కాంగ్రెస్ దెందులూరు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి నరసింహమూర్తి విజయాన్ని కోరుతూ ముండూరులో బుధవారం సిపిఎం, కాంగ్రెస్ నాయకుల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మే 13న జరగనున్న ఎన్నికల్లో భాగంగా ఇండియా వేదిక అభ్యర్థుల విజయాన్ని కోరుతూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు అమలు ఇండియా వేదిక ద్వారానే సాధ్యమవుతుందని చెప్పారు. కాంగ్రెస్ దెందులూరు అసెంబ్లీ అభ్యర్థి ఆలపాటి నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం, దెందులూరు నియోజకవర్గం అభివృద్ధికి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు మావూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నేత ఆలపాటి వెంకట చౌదరి. పలువురు కాంగ్రెస్, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

# 19న సిపిఎం నియోజకవర్గస్థాయి సమావేశం

ప్రజాశక్తి - ఆకివీడు

ఈనెల 19వ తేదీన సిపిఎం నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం జరుగుతుందని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి కె.తవిటి నాయుడు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంకాలం పార్టీ నాయకులు పెంకి అప్పారావు అధ్యక్షతన పార్టీ పట్టణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తవిటి నాయుడు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో 19వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం, కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలం తదితర ముఖ్యులు వక్తలుగా పాల్గొంటారన్నారు.

గత ఐదు సంవత్సరాలుగా బిజెపి రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. అయినప్పటికీ రాష్ట్రంలో టిడిపి, జనసేన, అధికార వైసిపి పార్టీలు సైతం బిజెపికి కొమ్ముకాస్తున్నాయన్నారు. ఈ రకమైన విధానం అవలంభిస్తున్న ఆ పార్టీలకు బుద్ధి చెప్పే విధంగా ప్రత్యేక ప్రణాళికను రూపొందించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డోకల లక్ష్మి, ఎస్.కె.వలీ, బి.రాంబాబు, సూరిబాబు, రవి పాల్గొన్నారు.

## 19న ప్రసాదరాజు నామినేషన్

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఈనెల 19వ తేదీన శుక్రవారం వైసిపి నరసాపురం అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 7.30 నిమిషాలకు అభిమానులు, నాయకులు, కార్యకర్తలతో మొగల్తూరు మండలంలోని పాతపాడు నుంచి ర్యాలీగా బయలుదేరి ముత్యాలపల్లి, మొగల్తూరు, సీతారామపురం మీదగా సబ్ కలెక్టర్ ఆఫీస్‌కి చేరుకుని నామినేషన్ దాఖలు చేయనున్నారు.

## 19న నిమ్మల సైకిల్‌పై వెళ్లి నామినేషన్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఈనెల 19వ తేదీన పాలకొల్లు మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆయన 19వ తేదీ శుక్రవారం పూలపల్లి వై.జంక్షన్ నుంచి ర్యాలీగా సైకిల్‌పై బయలుదేరి నామినేషన్ వేస్తున్నట్లు ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. టిడిపి, జనసేన కార్యకర్తలతో కలిసి ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని ఆయన నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారి ముందు దాఖలు చేయనున్నారు. ఈమేరకు పాలకొల్లులో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

## నరసాపురం ఎంపీ అభ్యర్థి మారే ప్రసక్తే లేదు

### టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పితాని

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఎంపీ అభ్యర్థి మారే ప్రసక్తే లేదని మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ అన్నారు. జనసేన నరసాపురం ఎంఎల్ఏ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ విజయానికి మద్దతుగా స్థానిక తెలగా కల్యాణ మండపంలో బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ మాజీ ఎంఎల్ఏ బండారు మాధవ నాయుడు సీటు కోసమే కాకుండా పార్టీ కోసం పనిచేశారు. టిడిపి రానున్న ఎన్నికల్లో నాయకర్‌ని గెలిపించుకోవాలన్నారు. సీటు విషయంలో కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పార్టీలో గ్రూపులు వద్దని, అందరూ కలిసి పని చేయాలని చెప్పారు. మాజీ ఎంఎల్ఏ బండారు మాధవనాయుడు మాట్లాడుతూ ఈ ఎన్నికలు నీతికి, నిజాయితీకి జరిగే ఎన్నికలన్నారు. అధికార పార్టీ ఇచ్చే నగదు, మద్యం తీసుకోండని, ఓటు మాత్రం నాయకర్‌కి వేయండని చెప్పారు. గత ఎన్నికల సమయంలో వశిష్ట వారధి పూర్తి చేసి ఓట్లు అడగడానికి వస్తానని చెప్పిన ప్రసాదరాజు ఇప్పుడు ఓట్లు అడగడానికి ఎలా వస్తున్నారన్నారు. జనసేన ఎంఎల్ఏ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో ప్రభుత్వంపై అనేక పోరాటాలు, ఉద్యమాలు చేశామన్నారు. ప్రజా సమస్యలపై పోరాడితే స్థానిక ఎంఎల్ఏ ప్రసాదరాజు అక్రమ కేసులు పెట్టారన్నారు. స్థానిక ఎంఎల్ఏ ప్రసాదరాజును ఓడించి ఇంట్లో కూర్చోబెట్టాలన్నారు. నియోజకవర్గం అభివృద్ధిలో కుంటుపడిందన్నారు. తొలుత మాధవ నాయుడు ఇంటి వద్ద నుంచి అభిమానులు, నాయకులతో కలిసి మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుక్కల మీరయ్య, చినిమిల్లి సత్యనారాయణ, మేకల సతీష్, బొమ్మిడి సునీల్ పాల్గొన్నారు.

## 'శిరోముండనం కేసులో తీర్పు బాధితులకు ఊరట'

ప్రజాశక్తి - పెనుమంట్ర

గడచిన 28 ఏళ్లగా న్యాయం కోసం ఎదురు చూస్తున్న శిరోముండనం బాధితులకు కోర్టు ఇచ్చిన తీర్పు వల్ల ఉపశమనం దొరికినట్లయ్యిందని అంబేద్కర్ ఆలోచనా వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చవ్వాకుల భరత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు దళిత యువకులకు 29 డిసెంబర్ 1996లో అప్పటి టిడిపి ఎంఎల్ఎ, ప్రస్తుత వైసిపి ఎంఎల్సి తోట త్రిమూర్తులు అత్యంత హేయంగా శిరోముండనం చేసి అవమానపరిచిన కేసులో కోర్టు బాధితులకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# నాయకర్ విజయం ఖాయం

### టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

జనసేన నరసాపురం నియోజకవర్గం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ విజయం ఖాయమని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. బుధవారం సాయంత్రం 'మనకోసం మన నాయకర్' కార్యక్రమంలో మొగల్తూరులోని పెద్ద పల్లవ పాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ సతీమణి సునీత, కుమార్తె శ్రేయలతో కలిసి గ్రామాల్లోన్ని ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్నికల మేనిఫెస్టో వివరించారు. ఈ ప్రచారంలో గుబ్బల నాగరాజు, కొల్లాటి గోపికృష్ణ, వాటాల కృష్ణ మూర్తి, కొప్పాడి నాగరాజు, వాటాల దుర్గరాజు, జక్కం శ్రీమన్నారాయణ, లక్కు బాబీ, ముక్కుగిరి, పోలిశెట్టి నళిని, అంబటి అరుణ, అందే కొండ, అందే దొరబాబు, నల్లం సురేష్, గజ్జరపు ఫణి, నక్కా శేఖర్, చెన్నా మణికంఠ, కత్తిమండ ముత్యాలరావు, పంపన భగవాన్, పొన్నపల్లి శివ, మెండు రాజేష్, గుబ్బల చిన నాగరాజు, ముక్కు పుల్లయ్య, గురుజు శ్రీనివాసు, దేశింశెట్టి శ్రీను, దొంగ స్వామి, మీనాక్షి, గుడాల చింతన్న పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టిడిపి నేతలు

# మార్పు రావాలంటే నాయకత్వం మారాలి

### మహిళలు ఆర్థికంగా బలపడటమే రాజ్ ట్రస్ట్ లక్ష్యం

### జనసేన భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మార్పు రావాలంటే నాయకత్వం మారాలని, నోటితో చెప్పే మాటలు కన్నా చేతితో చేసే సేవలు ఎంతో గొప్పవని, పదేళ్లపాటు భీమవరం నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశానని మాజీ ఎంఎల్ఏ, జనసేన ఎంఎల్ఏ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. గునుపూడిలోని రాజ్ ట్రస్ట్ కార్యాలయంలో రాజ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గంటా రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్పు రావాలంటే నాయకత్వం మారాలని, ఈ నాయకత్వం వల్ల రాష్ట్రం వెనుకబడి పోయిందని చెప్పారు. ఇటువంటి రాక్షస పాలనకు స్వస్తి చెబుదామన్నారు. ఈ ప్రభుత్వంతో ఎన్నో ఇబ్బందులు పడ్డారని, అటువంటి ప్రభుత్వం మనకు వద్దని, రానున్నది రామ రాజ్యమన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.నాలుగు వేలకు పింఛన్లు పెంచుతున్నామని, వికలాంగులకు రూ. ఆరు వేలు పింఛన్లు ఇంటికే తీసుకొస్తామని చెప్పారు. ఉచిత బస్సు సౌకర్యం కూడా రాబోతుందన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, రైతులకు రూ.25 వేలు అందిస్తామని చెప్పారు. ప్రతి సమస్యను పరిష్కరించి అందరూ ఆనందంగా ఉండటమే టిడిపి కూటమి లక్ష్యమన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు మెంటే గోపీ మాట్లాడుతూ ప్రజలు గెలిచారంటే అప్పుడు అంజిబాబు గెలిచినట్లేనన్నారు. గ్లాస్ గుర్తుకు ఓటు వేసి అంజిబాబును గెలిపించాలని కోరారు. అంజిబాబు కుమారుడు పులపర్తి ప్రశాంత్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఎన్నికల్లో గ్లాస్ గుర్తుకు ఓటు వేసి అంజిబాబును గెలిపించాలన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు గంటా రాజ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి విజయానికి కృషి చేద్దామన్నారు. అనంతరం వంద మంది మహిళలు పార్టీలోకి చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో యేలేటి న్యూటన్, విజ్జురోతి రాఘవులు, ఆకుల కృష్ణ పాల్గొన్నారు.

## ఏలూరు జిల్లాలో ఓటర్లు 16.34 లక్షల మంది

(మొదటి పేజీ నుంచి)

చెప్పారు. పోలింగ్ స్టేషన్లలో ప్రాథమిక సౌకర్యాలు కల్పించామన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఈ నెల 15వ తేదీ వరకు అందిన ఫారం 6 దరఖాస్తులను నిర్దేశించిన సమయంలో పరిష్కరిస్తామన్నారు. ఫారం-7, 8 దరఖాస్తులు నిలిపివేశామని తెలిపారు. ఇవిఎంల తనిఖీ పూర్తి చేశామని, ఏ పోలింగ్ స్టేషన్‌కు ఏ ఇవిఎం పంపాలన్నది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి, సంబంధిత నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూమ్‌లకు పంపించామన్నారు. వాటికి సిఆర్‌పిఎఫ్, సిఐఎస్ఎఫ్ సిబ్బందితో భద్రత కల్పిస్తున్నామన్నారు. పార్లమెంట్, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా అంతర్ రాష్ట్ర సరిహద్దుల వద్ద 8 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. విస్తృత తనిఖీల ద్వారా రూ.13.17 కోట్లు విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు వివరించారు. జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు స్వీప్ కార్యక్రమం ద్వారా ఓటు హక్కు వినియోగంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. నామినేషన్లు వేసే అభ్యర్థులు తమ క్రిమినల్ యాంటిసిడెంట్స్‌పై ప్రకటనలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రచారాల్లో వ్యక్తిగత దూషణలు చేయరాదని, తమ ప్రచారానికి రమ్మని, తమకే ఓటు వేయమని ప్రజలను భయభ్రాంతులను చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ ఎన్నికల ప్రచార కార్యక్రమాలు నిర్వహణకు అనుమతులు తీసుకోవాలన్నారు.

## నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి

(మొదటి పేజీ నుంచి)

సమావేశాలు, సభలునిర్వహిస్తే, ఆ ఖర్చును ఇద్దరికీ సర్దుబాటు చేస్తామని పేర్కొన్నారు. జిల్లాకు ముగ్గురు అధికారులను వ్యయ పరిశీలకులుగా ఎన్నికల కమిషన్ నియమించిందని, ఒకరు పార్లమెంటుకు, మిగిలిన ఇద్దరు అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. త్వరలో వారు జిల్లాకు రానున్నారని, వారు వచ్చేలోగా అవసరమైన అన్ని రిజిష్టర్లను సిద్ధం చేసి, ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు. సభలు, సమావేశాలు జరిగిన 24 గంటల్లోగానే అభ్యర్థి ఖాతాలో ఖర్చు నమోదు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

**నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి**

ఈ నెల 18న గురువారం సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుందని, అదేరోజు నుండి అభ్యర్థుల నామినేషన్ దాఖలు ప్రక్రియ ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. అన్ని నియోజకవర్గాల ఆర్‌ఒల పరిధిలో దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లనూ సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఆర్‌ఒ కార్యాలయాన్ని భీమవరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశామని తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గానికి నామినేషన్ వేసే అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.25 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని, అసెంబ్లీ నియోజకవర్గానికి నామినేషన్ వేసే అభ్యర్థులు రూ.10 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఎస్‌సి రిజర్వుడ్ నియోజకవర్గాల్లో 50 శాతమే డిపాజిట్ ఉంటుందని తెలిపారు. ఎక్కడా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉల్లంఘన జరగకుండా చర్యలకు ఉద్దేశించినట్లు తెలిపారు. నామినేషన్లు స్వీకరించడానికి ఉద్దేశించిన గదిలో 360 డిగ్రీల కోణంలో పనిచేసే సీసీ కెమెరాను అమర్చారని, అలానే రాకపోకలకు ఉద్దేశించిన ద్వారాన్ని సీసీ కెమెరా రికార్డు చేస్తుందని పేర్కొన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థులకు మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉందని, ఆ వాహనాలను ఆర్‌ఒ గదికి వంద మీటర్ల దూరంలో నిలిపి ఉంచాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్ దాఖలు చేయడానికి అభ్యర్థితోపాటు మరో నలుగురు మొత్తం ఐదుగురికి మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. పోటీ చేయు ప్రతి అభ్యర్థి తన పేరున ఏదైనా బ్యాంకులో కొత్తగా అకౌంటును ప్రారంభించి ఆ వివరాలను నామినేషన్‌తోపాటు రిటర్నింగ్ అధికారికి అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

## నామినేషన్లు షురూ

(మొదటి పేజీ నుంచి)

మందిరాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించకూడదు. ప్రతిరోజూ ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం పది గంటల వరకు మాత్రమే ప్రచారం నిర్వహించాల్సి ఉంటుంది.

**తొలి రెండు, మూడు రోజుల్లో నామినేషన్లు వేసే ప్రధాన పార్టీల అభ్యర్థులు వీరే**

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన తొలిరోజు 18వ తేదీన ఏలూరు వైసిపి అభ్యర్థి ఆళ్ల నాని, నూజివీడు నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. 19వ తేదీన ఆచంట టిడిపి అభ్యర్థి పితాని సత్యనారాయణ, వైసిపి అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, నరసాపురం వైసిపి అభ్యర్థి ప్రసాద్‌రాజు, తణుకు వైసిపి అభ్యర్థి కారుమూరి నాగేశ్వరరావు నామినేషన్లు వేయనున్నారు. 21న నూజివీడు టిడిపి అభ్యర్థి కొలుసు పార్థసారథి, 22న నరసాపురం జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్, చింతలపూడి టిడిపి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్, కైకలూరు వైసిపి అభ్యర్థి దూలం నాగేశ్వరరావు నామినేషన్ వేయనున్నారు. 23న ఉంగుటూరు జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, కైకలూరు బిజెపి అభ్యర్థి కామినేని శ్రీనివాస్, ఏలూరు టిడిపి అభ్యర్థి బడేటి చంటి, నూజివీడు వైసిపి అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నామినేషన్లు వేయనున్నట్లు సమాచారం.

**ఎన్నికల షెడ్యూల్ ఇలా**

18 నుంచి 25వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ
26న నామినేషన్ల పరిశీలన
29వ తేదీ విత్‌డ్రాలకు ఆఖరుతేదీ
మే 13న పోలింగ్
జూన్ 4న ఓట్ల లెక్కింపు

# ఐవిఆర్ కాల్స్ కలకలం

## ఓటు ఎవరికి వేస్తారని ఆరా

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల రూరల్

ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఏ పార్టీకి ఓటు వేస్తారనే దాని గురించి ఐవిఆర్ కాల్స్ గోపాలపురం నియోజకవర్గంలో కలకలం సృష్టిస్తున్నాయి. ఇవి ఎంతవరకు కరెక్ట్ అని, ఓటు ఎవరికి వేస్తారనే విషయాన్ని ముందుగానే ఐవిఆర్ కాల్స్ ద్వారా ఎందుకు ప్రజలు చెప్పాలని అనేక సందేహాలున్నాయి. దీనిపై ఇసి ఎలాంటి చర్యలు తీసుకోదా అని ప్రశ్నలూ ఉన్నాయి. గోపాలపురం నియోజకవర్గంలో ఇద్దరు వ్యక్తులు టిడిపి, వైసిపి నుంచి ఎంఎల్ఎ అభ్యర్థులుగా వారు ప్రచారాలను కొనసాగిస్తున్నారు. ఓటర్లకు కొన్ని నెంబర్ల ద్వారా ఫోన్ చేసి ఎవరికి ఓటు వేస్తున్నారని అడుగుతున్నారు. మనం గమనిస్తే ఓటింగ్ విధానం చాలా రహస్యంగా జరుగుతూ ఉంటుంది. ఓటు వేసే ప్రక్రియ బహిర్గతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. ఓటర్లు ఎవరికి ఓటు వేశారనే అనే విషయం ఎవరికీ తెలియచేయకుండా వారి ఆయుధమైన ఓటు ద్వారా మాత్రమే వ్యక్తపరుస్తారు. కాని ఇందుకు భిన్నంగా ఐవిఆర్ కాల్స్ వస్తున్నాయని, ఓటు ఎవరికి వేసేది బహిర్గతం చేయాల్సిందేనా, లేక ఇది కొత్త విధానామా అని ఓటర్లు ఆలోచిస్తున్నారు.

# అర్చకునికి కాసు బంగారం బహూకరణ

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కోమటి గుంటలో కోదండ రామాలయం అర్చకులుగా చేస్తున్న పవన్‌కుమార్‌కు ఒక దాత కాసు బంగారాన్ని బహుకరించారు. కోదండ రామాలయం నిర్మించి 12 ఏళ్లు అవుతుంది. కోమటిగుంట గ్రామానికి చెందిన మంతెన నాగఆంజనేయులు కెవిఎల్ఎస్ ఫుడ్స్ వ్యాపారంలో రాణిస్తున్నారు. గత ఏడేళ్లగా శ్రీరామనవమి శుభ సందర్భంగా దాత మంతెన నాగ ఆంజనేయులు అర్చకునికి కాసు బంగారాన్ని అందిస్తున్నారు. ఈ ఏడాది రూ.56 వేల విలువైన కాసు బంగారాన్ని అర్చకులు పవన్ కుమార్‌కు బహుమతిగా అందించి ఘనంగా సత్కరించారు. దాతల సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు. కోదండ రామాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అర్చకునికి బంగారు అందిస్తున్న దాత

# మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

## తహశీల్దార్ నాగార్జున



పాలకోడేరు : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్ నాగార్జున

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎవరికి వారే తమ సొంత ప్రయోజనాలు చూసుకునే ఈ రోజుల్లో ప్రధాన రహదారిపై ప్రయాణించే ప్రజలకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చడం అభినందనీయమని పాలకోడేరు తహశీల్దార్ నాగార్జున అన్నారు. మండలంలోని పెన్నాడ గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని తహశీల్దార్ నాగార్జున బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు సహకారం అందించినా చలివేంద్రాన్ని నిర్వహించటం చాలా శ్రమతో కూడిన వ్యవహారమన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఏడాది 70 నుంచి 90 రోజుల పాటు వేసవిలో దాహార్తిని తీర్చేందుకు సుందరయ్య స్ఫూర్తితో చలివేంద్రం నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎ.లక్ష్మీతులసి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు అశ్రీయ్యా, గ్రామ పెద్దలు నడిపల్లి సత్యనారాయణ, ఎ.కృష్ణ, ఎ.శ్రీనివాసరావు, కలిదిండి గోపాలరాజు, శేషపు నాగలక్ష్మి, దొంతర రాధ పాల్గొన్నారు.

**చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో...**

తాడేపల్లిగూడెం : స్థానిక చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో హోం శాఖ మంత్రి తానేటి వనిత భర్త డాక్టర్ తానేటి శ్రీనివాసరావు చలివేంద్రాన్ని ప్రారంభించారు. చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్ యాజమాన్యం కె.సోమేశ్వరరావు ఆధ్వర్యంలో గత మూడేళ్లగా ప్రతి ఏడాది పోస్టాఫీస్ రోడ్డులో పవన్ మెస్ సెంటర్‌లో వేసవికాలం మూడు నెలలు చలివేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డాక్టర్ తానేటి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైతన్య హాస్పటల్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నూకల దుర్గ, వాకర్స్ అసోసియేషన్ నాయకులు అనిల్ నాగరాజు, కృష్ణార్జున ఎలక్ట్రికల్స్ అధినేత రాగిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం : చలివేంద్రాన్ని ప్రారంభించిన శ్రీనివాసరావు

# జనసేనలోకి చెల్లారెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వైసిపి సీనియర్ నాయకుడు మేడపాటి చెల్లారెడ్డి జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. బుధవారం ఆయన స్వగృహం నుంచి వీకర్స్ కాలనీ ఘంటసాల బొమ్మ వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలందరూ బొలిశెట్టి శ్రీనివాస్‌కు మద్దతు పలకాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైసిపి విజయానికి కృషి చేసినవారంతా ఇక్కడి అవినీతి పాలనకు, స్థానిక నాయకుని మామూళ్ల వసూళ్లకు బాధితులయ్యారన్నారు. అందుకే అందరూ ఏకతాటిపై జనసేన పార్టీలో చేరుతున్నారన్నారు. సీనియర్ నాయకులు తోట గోపీ మాట్లాడుతూ చెల్లారెడ్డి వంటి నాయకులు వైసిపి వీడి జనసేనలో చేరడం స్వాగతించాల్సిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పైబోయిన రఘు, వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, అచ్చుతం, మైలవరపు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

# వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - ఆచంట

రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీల మద్దతు వైసిపికే ఉంటుందని ఆచంట వేమవరం గ్రామానికి చెందిన ముస్లిం మత గురువు షేక్ తాజుద్దీన్ అన్నారు. ఆచంట నియోజకవర్గంలోని ముస్లిం సోదరులు మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సమక్షంలో బుధవారం తూర్పుపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో వైసిపిలో చేరారు. వారికి శ్రీరంగనాథరాజు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పెనుమంట్ర గరువు నుంచి గౌడ, శెట్టి బలిజ మహిళలు, యువకులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సమక్షంలో వైసిపిలో చేరారు.

# ఫారం-6 దరఖాస్తుపై విచారణ

**నరసాపురం :** పట్టణంలోని పోలింగ్ బూత్ నెంబర్ 48లో జవ్వాది బంగారు సాయి శిరీష కొత్త ఓటుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో బిఎల్ఒ విచారణకు వెళ్లగా అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు ఇవ్వాలని కోరగా అందించలేదని టౌన్ ప్లానింగ్ అధికారి వి.శేషగిరి తెలిపారు. 2019లో తన ఓటు తొలగించినట్లు ఎన్నికల సిఇఒకు ఫిర్యాదు చేశారన్నారు. పలుమార్లు విచారణకు పిలిచిన సహకరించడంలేదని, రిటర్నింగ్ అధికారి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదని చెప్పారు. తన నివాసం వద్ద విచారణ చేయగా ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారని తేలిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఓటర్ హెల్ప్‌లైన్‌లో పలుమార్లు తనిఖీ చేయగా తెలంగాణ రాష్ట్రం మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లిలో ఓటు ఉందని, దీంతో ఫారం-6 రద్దు చేసి, తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదించామని శేషగిరి తెలిపారు

# 40 శాతం సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలి

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న జక్కంశెట్టి సత్యనారాయణ

**ప్రజాశక్తి - పాలకోడేరు**

ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్ 40 శాతం ఇవ్వాలని, అడిగిన వారందరికీ పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని శృంగవృక్షం గ్రామంలో పంట కాలువలో పని చేస్తున్న కూలీల సమస్యలను సత్యనారాయణ బుధవారం అడిగి తెలుసుకుని మాట్లాడారు. కొందరు ఆకతాయిలు మద్యం తాగేసి ఆ సీసాలను పంట కాలువల్లో పడేయడంతో అందులో దిగి పని చేస్తున్న కూలీలకు గాయాలవుతున్నాయన్నారు. కనీసం ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉండడంలేదన్నారు. గతంలో వేసవిలో తాగునీటికి, మజ్జిగకు ప్రభుత్వం నిధులు కేటాయించేదని, ప్రస్తుతం కూలీలే తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. వేతనాలు బ్యాంకుల ద్వారా కాకుండా పోస్టాఫీస్‌ల ద్వారా ఇచ్చే పద్ధతి కొనసాగించాలన్నారు. ఆన్‌లైన్ మస్టర్ కాకుండా పాత పద్ధతిలో మస్టర్ విధానాన్ని కొనసాగించాలని, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, రూ.200 రోజులు పని దినాలు పెంచాలని డిమాండ్ చేశారు.




లోకేష్‌రెడ్డిని అభినందిస్తున్న వక్తలు

## లోకేష్‌రెడ్డికి పలువురి అభినందన

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో జూనియర్ విభాగంలో 464 మార్కులు సాధించిన మార్టేరు పుంతవీధికి చెందిన కొవ్వూరి లోకేష్‌రెడ్డిని పలువురు అభినందించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన కొవ్వూరి ధర్మారెడ్డి, గాయత్రి దంపతుల కుమారుడు లోకేష్‌రెడ్డి భీమవరం ఎస్ఆర్‌కెఆర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. మార్టేరు వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాడెంట్ గుడిమెట్ల రామారెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన లోకేష్‌రెడ్డి పదో తరగతి ఫలితాల్లో ప్రథమ ర్యాంకు సాధించాడని చెప్పారు. ఇప్పుడు ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో కాలేజీ ఫస్ట్ వచ్చాడని తెలిపారు. విద్యార్థికి వారు జ్ఞాపిక అందించారు.



ప్రచారం చేస్తున్న సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ నేతలు

## ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్

**ప్రజాశక్తి - ఏలూరు**

సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని, మతోన్మాద బిజెపి, రాష్ట్రంలో దానికి తొత్తుగా వ్యవహరిస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీలను ఓడించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. సిపిఐ ఏలూరు అసెంబ్లీ ఇండియా కూటమి అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం కార్యకర్తలు బుధవారం ప్రచారం నిర్వహించారు. ప్రచార సభలో ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలు అమలు చేయకుండా విస్మరించిందన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, రైతులకు కనీస మద్దతు ధర చట్టం చేస్తామని, నల్లధనం వెలికితీసి పేదల ఎకౌంట్లో రూ.15 లక్షలు జమ చేస్తామని, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విభజన హామీలు ఇస్తామని ఇలా అనేక వాగ్ధానాలు చేసిందన్నారు. కాని బిజెపి ఈ పదేళ్లల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని విమర్శించారు. అంతేకాకుండా ఈ పదేళ్లలో గతంలో ఎన్నడూ లేనివిధంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ కరెంటు ఛార్జీలను పెంచిందని విమర్శించారు. కార్మికులకు వర్తించే చట్టాలను తీసేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందన్నారు. దేశంలో మణిపూర్, కర్ణాటక, ఢిల్లీ వంటి అనేక రాష్ట్రాల్లో ముస్లింలు, క్రైస్తవులపై దౌర్జన్యాలు చేయించిందన్నారు. ఇప్పుడు ఎన్నికల ముందు మళ్లీ సిఎఎ చట్టాన్ని తీసుకొచ్చి మత ప్రాతిపదికన ప్రజలను విడగొట్టాలని చూస్తుందని విమర్శించారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిపిఎం జిల్లా నాయకులు బి.సోమయ్య, నగర కార్యదర్శి పి.కిషోర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.కన్నబాబు, ఉండేటి బేబి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, ఉపాధ్యక్షురాలు మావూరి విజయ, గొర్లి స్వాతి, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డాంగే పాల్గొన్నారు.

# చెక్‌పోస్టులు సమర్ధవంతంగా పనిచేయాలి : జెసి




రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జెసి ప్రవీణ్‌ఆదిత్య

**ప్రజాశక్తి - ఉండి**

ఫ్లయింగ్ సర్వే లైన్స్, స్టాటిక్ సర్వే లైన్స్ చెక్‌పోస్టులు 24 గంటలూ సమర్ధవంతంగా పని చేయాలని జెసి, ఉండి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సివి.ప్రవీణ్ ఆదిత్య అధికారులను ఆదేశించారు. ఉండి మండలం ఆరేడు గ్రామం చెక్‌పోస్ట్ వద్ద సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఏర్పాటుచేసిన స్టాటిక్ సర్వే లెన్స్ టీం (ఎస్ఎస్‌టి) చెక్ పోస్టును ఉండి ఎంపిడిఒ రవీంద్రతో కలిసి జాయింట్ కలెక్టర్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జెసి ప్రవీణ్‌ఆదిత్య మాట్లాడుతూ చెక్‌పోస్టులు 24 గంటలూ సమర్ధవంతంగా పని చేయాలని, రిజిస్టర్లలో ప్రతిదీ పక్కాగా నమోదు చేయాలని తెలిపారు. నగదు, మద్యం, మాదక ద్రవ్యాలను వాహనాల్లో తరలించకుండా కట్టడి చేయాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద భద్రత చర్యలు పటిష్టంగా చేపట్టాలని, ద్విచక్ర, భారీ, అతి భారీ వాహనాలను క్షుణంగా తనిఖీ చేయాలని ఫ్లయింగ్ సర్వే లైన్స్ టీం (ఎఫ్ఎస్‌టి), స్టాటిక్ సర్వేలైన్స్ టీం (ఎస్ఎస్‌టి)లను ఆదేశించారు.

# సెల్‌ఫోన్ టెక్నీషియన్ల ఆందోళన



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సెల్‌ఫోన్ టెక్నీషియన్లు

**ప్రజాశక్తి - భీమవరం రూరల్**

హోల్‌సేల్ స్పేర్ పార్టులు అమ్మే షాపులవారు రిటైల్ అమ్మకాలు మొదలెట్టి వారి షాపుల్లోనే మరమ్మతులు చేయిస్తున్నారని, దీంతో సుమారు తాము ఉపాధి కోల్పోతున్నామని టెక్నీషియన్స్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమిటని అడిగితే హోల్ సేల్ వ్యాపారం చేసే మార్వాడీలు తమపై దౌర్జన్యానికి దిగారని వాపోయారు. ఈ మేరకు వారు బుధవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా భీమవరం సెల్‌ఫోన్ టెక్నీషియన్ అసోసియేషన్ సెక్రటరీ నాగబాబు మాట్లాడుతూ తాము పట్టణంలోని రెండు సెల్‌ఫోన్ హోల్‌సేల్ షాపులతో కాంట్రాక్టు తీసుకున్నామని తెలిపారు. కాని వారు కాంట్రాక్టుకు వ్యతిరేకంగా హోల్‌సేల్ వ్యాపారం చేస్తూ రిటైల్ రిపేర్ కూడా చేస్తున్నారని చెప్పారు. దీంతో తమ జీవనోపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వారు దీనిని వెంటనే మానుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని తెలిపారు.

# సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో పరీక్ష

**ప్రజాశక్తి - ఉండి**

నాలుగో తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించేందుకు సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో పరీక్షను నిర్వహించినట్లు సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి శ్యాంసుందర్ అన్నారు.ఉండి మండలంలోని శ్రీ శశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, ఇండియన్ డిజిటల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, చెరుకువాడ మెయిన్ స్కూల్ విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఫలితాన్ని బట్టి ఆ పాఠశాల విద్యా బోధన కూడా తెలుస్తుందన్నారు. ఈ తనిఖీల్లో ఎంఇఒ-1 జ్యోతి, ఎంఇఒ-2 వినాయకుడు, సర్వ శిక్ష అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.



నరసాపురంలో...

## అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

**ప్రజాశక్తి - నరసాపురం**

అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నరసాపురం అగ్నిమాపక అధికారి కె.భాస్కర్‌రామ్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం పట్టణంలో రాయిపేటలోని శ్రీకృష్ణ రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు ఎలా జరుగుతాయి, వాటిని అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గృహాల్లో ఎల్‌పిజి వాడడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వంటగదిలో గ్యాస్ సిలిండర్ లీక్, అగ్నిప్రమాదం జరిగితే, ఆయిల్ ఫైర్ అయితే మంటలు ఎలా అదుపు చేయాలని ఫైర్ సిబ్బంది డెమో చూపించి వివరించారు. అపార్ట్‌మెంట్, గృహాల్లోనూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదానికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు.

**తాడేపల్లిగూడెంలో...**

**తాడేపల్లిగూడెం :** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం స్థానిక అగ్నిమాపక శాఖాధికారి జి.రామారావు ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం కెఎన్.రోడ్డులో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ, తగు జాగ్రత్త చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖాధికారి గణేశ్న వెంకట రామారావు, సిబ్బంది పెట్రోల్ బంకులో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగినపుడు ఫైర్ ఎక్స్టింగ్విషర్ల ఎలా ఉపయోగించాలో డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెట్రోల్ బంకు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

# కనకరత్నమాలకు స్వర్ణ నంది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కనకరత్నమాల

**ప్రజాశక్తి - ఆచంట**

1983 నుంచి 2024 వరకు శ్రీ సంక్షేమ శాఖ ద్వారా భీమలాపురం గ్రామానికి చెందిన శ్రీదేవి ఆర్యవైశ్య మహిళా సేవ మండలాధ్యక్షురాలు కొత్త కనకరత్నమాల పలు సేవా కార్యక్రమాలు చేసింది. ఈ సందర్భంగా స్వర్ణ నంది పురస్కారం అందుకున్నట్లు ఆమె తెలిపారు. ఆదర్శ కళానిలయం ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రకాష్, లలిత దంపతుల నిర్వహణలో హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ భవనంలో డాక్టర్ దేవులపల్లి రామానుజారావు కళామందిరంలో ఉగాది స్వర్ణనంది పురస్కారాలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా సుమారు 42 మంది వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులను గుర్తించి ఈ పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమానికి సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ, ప్రముఖ సినీ నటులు మా ఈసీ సభ్యులు మాణిక్, ప్రముఖ సినిమా టీవీ నటులు రాజేందర్, విజయ భాస్కర్, ఆంధ్రప్రదేశ్ అమరావతి అసెంబ్లీ ఒఎస్‌డి డాక్టర్ ఎం.ప్రభాకర్, సోషల్ మీడియా ఇన్ఫ్లెన్సర్స్ వెంకటేష్ కళ్యాణి, శ్రీకాంత్ సంధ్య, శ్రీనివాస్ రమణమ్మ దంపతులతో పాటు డాక్టర్ భవాని భరద్వాజ్, కొత్త కనకరత్నమాల హాజరయ్యారు. 1983 నుంచి 2024 వరకు విద్య, వైద్య, సామాజిక వృత్తి శిక్షణ కోర్సులు, స్వయం ఉపాధి పథకాలు, సాంస్కృతిక యోగా కార్యక్రమాలతో పాటు పలు సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా తనకు స్వర్ణ నంది పురస్కారం అందించారని కనకరత్నమాల తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ వాకర్ ప్రెసిడెంట్ మురళీమోహన్‌రావు, 201 జిల్లా అధ్యక్షులు వై.సత్యనారాయణ, పాలకొల్లు మాజీ ఎంఎల్‌ఎ బంగారు ఉషారాణి, అంబికా కృష్ణ, శ్రీదేవి ఆర్యవైశ్య మహిళా సేవా మండలి, స్రవంతి మహిళా మండలి సభ్యులు గ్రామ వైశ్య ప్రముఖులు అభినందనలు తెలిపారు.